క్లుప్తంగా

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తొండూరు విద్యార్థిని



ప్రిన్సిపాల్ తులశమ్మ చేతులమీదుగా ట్రోఫీని అందుకుంటున్న విద్యార్థిని కవిత

తొండూరు : జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తొండూరుకు చెందిన విద్యార్థిని కవిత ఎంపికైందని ప్రిన్సిపాల్ తులశమ్మ మంగళవారం తెలిపారు. 66వ ఫుట్‌బాల్ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ టోర్నమెంట్ కం సెలెక్షన్స్‌లో తొండూరు అంబేడ్కర్ గురుకుల కళాశాలకు చెందిన కవిత ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైంది. కవితకు ప్రిన్సిపాల్ తులశమ్మ ట్రోఫీని అందించి అభినందనలు తెలిపారు.

కుష్టులేని గ్రామాలే లక్ష్యం

తొండూరు : కుష్టు వ్యాధిలేని గ్రామాలే మన లక్ష్యమని తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ రేష్మా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడివారిపల్లె గ్రామంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో లెప్రసీ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ డాక్టర్ రేష్మా హాజరై మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది నిర్వహించే సర్వేకి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కొండాపురం : మండలంంంలోని ఏటూర్ గ్రామ శివార్లలో మంగళవారం జూదమాడుతున్న ఆరు గురిని అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ. 14,200 స్వాధీనం చేసుకున్నట్లు తాళ్ల ప్రొద్దుటూర్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'


ముద్దనూరు : మండలంలోని కొసినేపల్లె గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

చెన్నూరు : బుద్దాయపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పాలగిరి ఉమామహేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఆరోగ్యం సరిగాలేక కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగృహానికి చేరుకున్న విషయం తెలుసుకుని ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జీఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్ ఆర్, ఉప్పరపల్లె ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 బస్తాల చౌక బియ్యం పట్టివేత

కమలాపురం : పట్టణంలోని సంబటూరు బస్టాండు వద్ద అక్రమంగా తరలిస్తున్న 20 బస్తాల చౌక బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. మంగళవారం రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో.. సంబటూరు బస్టాండు వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. మైదుకూరుకు చెందిన సుధాకర్ ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయించుకోవడానికి ఆటోలో తరలిస్తుండగా ఎస్‌ఐ సిబ్బందితో కలసి పట్టుకున్నారు. సుధాకర్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి 20 బస్తాల రేషన్ బియ్యంతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు.



శ్రీవేంకటరమణ..గోవిందా..గోవిందా

- ఉదయం సింహ వాహనం.. రాత్రి ముత్యపు పందిరి వాహనం
- స్వామివారికి ఊంజల్‌సేవ



సింహవాహనంపై శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : మము కరుణించరావా శ్రీవేంకటరమణ..గోవిందా..గోవిందా అంటూ భక్తులు స్వామివారిని ఆరాధించారు. పులివెందుల నడిబొడ్డులో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు మంగళవారం ఉదయం శ్రీవారు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం సతీసమేతుడై స్వామివారు ముత్యపు పందిరి వాహనంలో పురవీధులలో జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారు ఊరేగుతుంటే భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పించారు. శ్రీవేంకటరమణుడు రాకతో పురవీధులు పులకించాయి. దీప కాంతులతో ముత్యాలు, సుగంధ దివ్యపరిమళ పుష్పాల అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, నివేదన, నిత్య హోమం, కలశారాధన, ఇత్యాది కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు నిర్వహించారు. ఉభయదారులతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

భానుకోటేశ్వరస్వామి క్షేత్రంలో ఏరాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, తదితరులు

సింహాద్రిపురం : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీభానుకోటేశ్వరస్వామి క్షేత్రం ప్రారంభానికి సిద్ధమైంది. రూ.4 కోట్లకుపైగా తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో నిర్మాణ పనులను పూర్తిగా రాతి కట్టడాలతో నిర్మించారు. భానుకోటేశ్వరస్వామి క్షేత్రం పునర్వార్త ప్రతిష్ట, కుంభాభిషస్తక మహోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు జేసీ సాయికాంత్ వర్మ, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ మహోత్సవ వేడుకలకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

నేటి నుంచి భానుకోటలో నూతన ఆలయాలు, విగ్రహ పునఃప్రతిష్ట వేడుకలు : సింహాద్రిపురం మండలం రావులకొలను పంచాయతీ పరిధిలోని భానుకోటేశ్వరస్వామి క్షేత్రం పునర్వార్త ప్రతిష్ట మరియు కుంభాభిషేక మహోత్సవ వేడుకలను బుధవారం నుంచి మూడవ తేదీవరకు నిర్వహించనున్నారు.

సీఎస్ పర్యటనపై కలెక్టర్ పరిశీలిన

ముద్దనూరు : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి విద్యనభ్యసించిన స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్ వర్మలు పరిశీలించారు. ఈనెల 3వ తేదీన సీఎస్ జవహర్‌రెడ్డి ముద్దనూరులో తాను చదువుకున్న రెండు పాఠశాలలను సందర్శిస్తుండటంతో పాఠశాలను, అక్కడ జరిగే అభివృద్ధి పనులను అధికారులు పరిశీలించారు.

శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాలు విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందులలో అతి పురాతనమైన దేవాలయమైన శ్రీరంగనాథస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల కరపత్రాలను మంగళవారం స్థానిక మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో ఆయన ఆధ్వర్యంలో విడుదల చేసినట్లు ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగాలి



సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ హిమదేవి

కమలాపురం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసేందుకు అన్ని వసతులు ఉన్నాయని, ప్రసవాలన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చూడాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఓపీ, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల సరఫరా తదితర వాటిని ఆసుపత్రి వైద్యులు శేఖర్, సునీల్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవాలు చేసేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతులు ఉన్నాయన్నారు. గర్భిణులు తప్పని సరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవించాలన్నారు. అలాగే కమలాపురంలో సైతం అన్ని వసతులు ఉన్నాయని, నార్మల్ డెలివరీ అయితే ఇక్కడే చేస్తామని, సిజేరియన్ అయితే మాత్రం కడప, ప్రొద్దుటూరులకు రెఫర్ చేస్తామన్నారు. ఫేస్ అటెండెన్స్ అమలు ఉండటంతో ఉద్యోగుల హాజరు బాగుందని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

ఎర్రగుంట్ల : స్థానిక నగర పంచాయతీ పరిధి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులలో వేగం పెంచాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్, హౌసింగ్, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జగనన్న కాలనీలో నిర్మాణాలు శరవేగంగా జరిపించాలని నోడల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనులు ప్రారంభం కాని లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. వారికి కూడా రుణ సదుపాయం కల్పించి ఇళ్లు కట్టుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం బీఎల్ దశలో ఉండే ఇళ్లను ఫిబ్రవరి నాటికి ఆర్‌ఎల్ దశకు వచ్చేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు నోడల్ అధికారులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

పరిహారం మంజూరుకు కృషి

కొండాపురం : మండల పరిధిలోని చిన్నపల్లె గ్రామానికి చెందిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూర్‌కు మార్గం సుగమం అయినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఒంటెద్దు రఘునాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గండికోట ప్రాజెక్ట్ పరిధిలోని గండికోట ఎత్తిపోతల పథకం స్టేజి-1 నుంచి తిమ్మాపురం చెరువు కింద చిన్నపల్లె గ్రామాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ గ్రామానికి గత తెలుగుదేశం ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి కృషితో ఆర్థిక శాఖ ద్వారా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద రూ.12 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

నేడు వైభవంగా రథయాత్ర ప్రారంభం

వేంపల్లె : చక్రాయపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీరాచరాయల స్వాముల వీరభద్రస్వామి దేవస్థానంలో బుధవారం వైభవంగా రథయాత్ర ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఓబుళరెడ్డి, సభ్యులు చక్రపాణిరెడ్డి, రామాంజనేయరెడ్డిలు తెలిపారు. ఈ రథయాత్ర చక్రాయపేటలో ప్రారంభమై మారెళ్లమడక, కొండవాండ్లపల్లె, అద్దాలమర్రి, చెరువుకాంపల్లె, కుమారకాల్వ, సిద్ధారెడ్డిపల్లె తదితర గ్రామాల మీదుగా కొనసాగుతుందన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లె గ్రామంలో నల్లనమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో 17 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన పెరుమాళ్ల శివకృష్ణయాదవ్ ఎద్దులు మొదటి బహుమతి, అనంతపురం జిల్లా ఎల్లనేరుకు చెందిన అరవింద్‌నాయుడు ఎద్దులు రెండవ బహుమతి, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన జంగా విజయ్‌భాస్కర్‌రెడ్డి ఎద్దులు మూడవ బహుమతి పొందాయి. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఖాళీల భర్తీకి

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న వర్కర్, హెల్పర్‌ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సుజామణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె అందులో పేర్కొన్నారు. ఖాళీల వివరాలను, రిజర్వేషన్ వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపురం టౌన్, 11వ వార్డు వర్కర్ (ఓసీ), కమలాపురం-1వ వార్డు హెల్పర్ (ఎస్టీ), అప్పారావుపల్లె-కమలాపురం-హెల్పర్(ఎస్సీ), ఎర్రగుంట్ల మండలం, కేజీవీపల్లె-వర్కర్(ఎస్సీ), ఎర్రగుంట్ల టౌన్ రాణివనం-1 హెల్పర్(ఓసీ), వీఎన్‌పల్లె మండలం, అంకిరెడ్డిపల్లె-వర్కర్ (ఎస్టీ), ఏ.ఓబాయపల్లె హెల్పర్-(పీహెచ్/ఓహెచ్),ఉరుటూరు-1-హెల్పర్ (బీసీ-సీ), పాయసంపల్లె -2 హెల్పర్ (ఎస్సీ) ఈ స్థానాల భర్తీకి రోస్టర్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆమె తెలిపారు.

పులివెందుల : పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీడీపీఓ శ్రీలత ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వేముల మండలం నారేపల్లె గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు బీసీ-బి, గొందిపల్లెలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు ఓసీ, పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని రాజ్యలక్ష్మి హాలు సమీపంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు ఓసీ, జెండామానువీధి-4 ఓసీ, మారుతి హాలు వీధిలో ఓసీలకు రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. అలాగే మినీ అంగన్‌వాడీ పోస్టులకు సంబంధించి తొండూరు మండలం యాదవారిపల్లె లో ఎస్సీ, సింహాద్రిపురం మండలం అహోబిలాపురంలో ఎస్సీ, లింగాల మండలం కె.చెర్లోపల్లెలో బీసీ-ఈ, వేముల మండలం శేషన్నగారిపల్లెలో బీసీ-సీ రిజర్వేషన్ కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వల్లూరు : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కడప రూరల్ సీడీపీఓ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఖాళీగా ఉన్న పెద్దలేబాక అరుంధతి వాడ పోస్టు ఓసీకి కేటాయించినట్లు ఆమె తెలిపారు. అలాగే హెల్పర్ల పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయని, చిన్నపుత్త ఓసీకి, కేబీజే నగర్ బీసీ-ఈ కి, బీచువారిపల్లె దళితవాడ ఎస్సీకి కేటాయించామన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. మండలంలోని అంజాద్‌నగర్ అంగన్‌వాడీ కార్యకర్తకు బీసీ-ఎ, బోడెద్దులపల్లి అంగన్‌వాడీ సహాయకురాలికి బీసీ-ఇ, అంగడి వీధి-1 అంగన్‌వాడీ సహాయకురాలికి బీసీ-సీ, ఇందిరానగర్-2 అంగన్‌వాడీ సహాయకురాలికి-ఎస్సీ, లింగారెడ్డిపల్లి అంగన్‌వాడీ సహాయకురాలికి-ఎస్టీ, నరసరామయ్యగారిపల్లె అంగన్‌వాడీ సహాయకురాలికి-ఎస్టీ, ఆర్‌ఎస్‌వై కాలనీలో మినీ అవగన్‌వాడీ కార్యకర్తకు ఎస్టీ కింద రిజర్వేషన్ల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

చెన్నూరు : స్థానిక మూడవ సచివాలయం పరిధిలోని 16వ వార్డు, కనపర్తి, జంగంరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుర్రమ్మ తెలిపారు. కనపర్తి బీసీ-డి, 16వ వార్డుకు ఎస్టీ, జంగంరెడ్డిపల్లె ఎస్టీలకు కేటాయించారన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్ర గాయాలు

ముద్దనూరు : మండలంలోని రాజులగురువాయిపల్లె గ్రామానికి చెందిన శివానందరెడ్డి, శివ పవన్‌కుమార్‌రెడ్డి అనే యువకులు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాల పాలయ్యారు. బాధితుల బంధువుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో శివానందరెడ్డి, శివపవన్‌కుమార్‌రెడ్డి శనగ పంట కోసే యంత్రానికి దారి చూపడానికి గ్రామ శివారులోని పొలాల్లోకి వెళ్లారు. ఆ ప్రాంతంలో చిన్న దుద్యాలకు చెందిన ఓ రైతు తాను సాగు చేస్తున్న పంట పొలం కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. పొలం గట్టు వెంట వెళ్తున్న వారికి విద్యుత్ తీగ తగిలి తీవ్ర గాయాల పాలయ్యారు. శివానందరెడ్డిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. పవన్‌కుమార్‌రెడ్డికి ప్రొద్దుటూరులో చికిత్స అందిస్తున్నారు. అనధికారికంగా పొలం వద్ద కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంవల్లే ఈ ప్రమాదం జరిగిందని, దీనిపై తగిన చర్య తీసుకుంటామని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ వర్మ తెలిపారు.



